# లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీదర్‌రాబు

## రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు..

### రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలపై అవగాహన కార్యక్రమం..

రంగారెడ్డి, జనవరి 11 (నమస్తేతెలంగాణ) : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హులైన ప్రతిఒక్క పేదకు లబ్ధి చేకూర్చే విధంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం రంగారెడ్డిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా అధికారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల అమలుపై ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..లబ్ధిదారుల ఎంపికలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో ప్రాతినిథ్యం వహిస్తున్న శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యుల సూచనలు, అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జనవరి 26 నుంచి అమలు చేసే రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలకు లబ్ధిదారుల ఎంపికచేయటంలో ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని అన్నారు. ఈ నాలుగు పథకాల అమలుపై గ్రామస్థాయిలో, మున్సిపల్ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి లిస్టులను సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామసభలు నిర్వహించే ముందు ఆయా ప్రాంతాల్లో టాంటాం వేయించాలని తెలిపారు. వచ్చే ఉగాది నుంచి పౌరసరఫరాల దుకాణాల్లో సన్నబియ్యం ఇవ్వటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గ్రామస్థాయి, మున్సిపల్ స్థాయిలో పర్యటించే బృందాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భూమిలేని కూలీ కుటుంబానికి రెండు విడుతలుగా రూ.12వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అలాగే, ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఇండ్లులేని నిరుపేద కుటుంబాలకు అవకాశమివ్వాలన్నారు. శాసనసభ్యులు సూచించిన విధంగా అర్బన్ ప్రాంతంలో లేదా రూరల్ ప్రాంతాల్లో గాని ప్రభుత్వ భూములున్నట్లయితే రెండో విడుతలో రాజీవ్ గృహం మాదిరిగా పది అంతస్తుల భవన సముదాయాలు నిర్మించి ఇండ్లులేని వారికి అందించటం జరుగుతుందన్నారు. అలాగే, రేషన్‌కార్డుల ఎంపికలో కూడా అర్హత కలిగిన వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఎంపిక ప్రక్రియ చేపట్టాలన్నారు. అలాగే, వ్యవసాయానికి యోగ్యం కాని భూములను నిర్ధారించి, రాళ్లు రప్పలున్న భూములను గుర్తించి వ్యవసాయం సాగుచేసే భూములకు మాత్రమే రైతు భరోసా అందే విధంగా చూడాలని మంత్రి సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రంగారెడ్డిజిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ..ఈ నాలుగు పథకాలకు సంబంధించి ఈనెల 11 నుంచి 13వరకు షెడ్యూల్ తయారు చేయటం జరిగిందన్నారు. అలాగే, 16 నుంచి 20వరకు ఆయాశాఖల బృందాలు లబ్ధిదారుల్లో అర్హులను గుర్తించి 21 నుంచి 24వరకు ఆయా గ్రామసభల్లో, మున్సిపల్ వార్డుల్లో లిస్టులు ఉంచటం జరుగుతుందన్నారు. రైతు భరోసాలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయ యోగ్యం భూములను గుర్తించాలని, కొత్త రేషన్‌కార్డుల ఎంపిక బృందాలు వెళ్లి నిజమైన అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్, శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, ఆరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఈర్లపల్లి శంకర్, ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కే. శశాంక్, మేడ్చల్, మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతమ్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్‌జైన్, రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు సంబంధించిన ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వర్కింగ్ ప్రొఫెషనల్స్ దేశాభివృద్ధికి పాటు పడాలి



డెవలప్‌మెంట్ స్టడీస్, పబ్లిక్ పాలసీలో పీహెచ్‌డీ ప్రోగ్రాంను ప్రారంభించిన ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ఇక్ఫాయ్ కులపతి సి.రంగరాజన్

### ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ఇక్ఫాయ్ కులపతి సి.రంగరాజన్

### 'ఐబీఎస్'లో డెవలప్‌మెంట్ స్టడీస్, పబ్లిక్ పాలసీలో పీహెచ్‌డీ ప్రోగ్రాం

చేవెళ్ల రూరల్, జనవరి 11 : పీహెచ్‌డీ ప్రోగ్రాంలో చేరిన (వర్కింగ్ ప్రొఫెషనల్స్) వారు తమ పరిశోధనకు సూచించిన అంశాలను మాత్రమే కాకుండా పరిధిని మించి పలు అంశాలు బాగా చదివి, విశ్లేషించి తమ రీసెర్చ్‌ను పూర్తి చేసి దేశ అభివృద్ధికి పాటుపడాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ఇక్ఫాయ్ కులపతి సి.రంగరాజన్ పేర్కొన్నారు. శనివారం శంకర్‌పల్లి మండల పరిధి దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయ ప్రాంగణం (ఐబీఎస్)లో ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో డెవలప్‌మెంట్ స్టడీస్, పబ్లిక్ పాలసీ విభాగంలో పీహెచ్‌డీ ప్రోగ్రాంను ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ఇక్ఫాయ్ కులపతి సి.రంగరాజన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సి.రంగరాజన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ సంస్థలు డొమైన్ పరిజ్ఞానాన్ని డేటా ఆధారిత విశ్లేషణాత్మక నైపుణ్యాలతో మిళితం చేశాయన్నారు. పబ్లిక్ పాలసీ యొక్క పరిశోధనాత్మక అంశాలు సామాన్య ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడాలో తెలుపాలన్నారు. ఇక్ఫాయ్ క్యాంపస్‌లో రీసెర్చ్ స్టడీస్‌లో అనుసరిస్తున్న విధానాన్ని వివరించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ సమీర్ శర్మ మాట్లాడుతూ.. అభ్యర్థులు ఉత్సాహంగా పీహెచ్‌డీ పూర్తి చేసి ముందుకు సాగాలని సూచించారు. తాను సివిల్ సర్వెంట్‌గా ఉన్నప్పుడు పీహెచ్‌డీ స్కాలర్‌గా తన అనుభవాలను పంచుకున్నారు. అనంతరం పీహెచ్‌డీ ప్రోగ్రాం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ సీఎస్.శైలజన్, మాజీ వైస్ చాన్స్‌లర్ మహేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డే ఓబన్నకు ఘన నివాళి



వికారాబాద్ కలెక్టరెట్‌లో వడ్డే ఓబన్న చిత్రాపటానికి నివాళులర్పించిన జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, బీసీ వెల్ఫేర్ అధికారి ఉపేందర్ తదితరులు

ధారూరు,జనవరి 11; వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం హాలు నందు వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, బీసీ వెల్ఫేర్ అధికారి ఉపేందర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతూ ఓబన్న ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశపెట్టినా భూమి శిస్తు విధానాన్ని నిరసిస్తూ వ్యతిరేకంగా చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులను సంచార జాతుల వారితో సుమారు పదివేల మందిని కూడ గట్టి బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పేద రైతుల పక్షాన నిలబడి వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కుల సంఘం నాయకులు వడ్డెర కుల సంఘం నాయకులు, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### రంగారెడ్డి కలెక్టరేట్‌లో..

ఆదిబట్ల : బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి న వ్యక్తి వడ్డే ఓబన్న ఆయన పోరాటం మరువ లేనిదని బీసీ సంక్షేమశాఖ అధికారి కేషురామ్ అన్నారు.శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న 218 వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కేషురామ్ వడ్డే ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన



రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో వడ్డే ఓబన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కేషురామ్ తదితరులు



↑ తాటిపర్తి గ్రామపంచాయతీ గోడకు అంటించిన లబ్ధిదారుల జాబితా

# ఫార్మా భూ బాధితులకు త్వరలో ప్లాట్లు

**ఫార్మాసిటిలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్ల పంపిణీ త్వరలోనే జరుగనున్నది. సీఎం ఆదేశాల మేరకు రైతులకు ప్లాట్ల పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నరు. ఇప్పటికే మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన లబ్దిదారుల జాబితాను అధికారులు విడుదల చేశారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్లాట్ల లబ్ధిదారుల జాబితాను రైతులకు అందుబాటులో ఉంచారు. త్వరలో లాటరీ విధానం ద్వారా లబ్దిదారులకు ప్లాట్లను కేటాయించనున్నారు. జిల్లాలోని కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలోని బేగరికంచె (బల్జగూడ)లో ఫార్మా భూనిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నవి. వెంచర్‌లో ప్లాట్ల పంపిణీ ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేస్తున్నరు. సంక్రాంతి తరువాత లబ్దిదారులకు ప్లాట్లు పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నేరుగా ప్రభుత్వమే రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్లు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కందుకూరు మండలం బేగరికంచె వద్ద 620ఎకరాల్లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ లేఅవుట్‌ను బ్లాకుల వారీగా ప్లాట్లను తయారుచేశారు. త్వరలోనే డ్రా పద్ధతిలో లబ్ధిదారులకు ప్లాట్లు పంపిణీ చేయాలని ఆదేశించడంతో రైతుల్లో ఒక్కసారిగా ఆశలు చిగురిస్తున్నవి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ సంకల్పం త్వరలోనే నెరవేరనున్నది.**

- నిర్వాసితులకు ఎకరాకు 121 గజాల ఇంటి స్థలం
- గతంలోనే సర్టిఫికెట్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- లబ్ధిదారుల జాబితా విడుదల
- లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి

**- యాచారం, జనవరి11**

జిల్లాలోని యాచారం, కందుకూరు మండలాల్లో ముచ్చర్ల కేంద్రంగా ప్రపంచంలోనే అతిపెద్ద హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటిని ఏర్పాటు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో శ్రీకారం చుట్టింది. దీనికోసం కొంత మేరకు భూసేకరణ సైతం అప్పటి సర్కారు చేపట్టింది. హైదరాబాద్‌కు సమీపంలో 19,333ఎకరాల్లో ఫార్మాసిటిని ఏర్పాటు చేసేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. దీనికి ఇప్పటికే జాతీయ పెట్టబడి మరియు తయారి జోన్ (నిమ్జ్) హోదాను కేంద్రం కల్పించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి టీఎస్ఐఐసీ (రాష్ట్ర పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థ) మండలంలో రైతులనుండి సుమారు 9,500ఎకరాలకు పైగా పట్టా, అసైన్డ్ భూములను సేకరించింది. ఫార్మాసిటిలో భూములు కోల్పోయిన రైతులకు ముందుగా ఎకరాకు పట్టా భూమికి రూ.12.50లక్షలు, అసైన్డ్ భూమికి రూ.7.70లక్షలు, తరువాత రైతుల డిమాండ్ మేరకు పట్టాకు రూ.16లక్షలు, అసైన్డ్‌కు రూ.8లక్షల పరిహారాన్ని అందజేసింది. ఇంకా 3వేల ఎకరాల భూమికి సంబందించి కోర్టులో కేసులు ఉండటం వలన పరిహారం చెల్లించలేక పోయింది. కొంత మంది రైతులు ఫార్మాసిటికి వ్యవసాయ భూములను ఇవ్వబోమని స్పష్టం చేశారు. దీంతో అట్టి భూములపై గత కొంత కాలంగా ప్రభుత్వానికి, రైతులకు మధ్యం పోరాటం కొనసాగుతుంది.

## నిర్వాసితులకు ఎకరాకు 121గజాల ప్లాటు

ఫార్మా భూ నిర్వాసితులకు పరిహారంతో పాటు అదనంగా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలోని బేగరికంచె (బల్జగూడ) వద్ద సర్వేనంబర్ 90, 91లో ఎకరాకు 121గజాల చొప్పున పాట్లను ఇచ్చేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎచ్ఎండీఏ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే లబ్దిదారులకు ప్లాట్లకు సంబంధించిన పట్టాలను గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అందజేసిన విషయం తెలిసిందే, బీఆర్ఎస్ హయాంలోనే లబ్దిదారులకు ప్లాట్లు అందజేయాలని అప్పటి ప్రభుత్వం భావించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు లాటరీ ద్వారా పాట్లు కేటాయించే సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో పాట్ల పంపిణీ పక్రియ అక్కడే నిలిచి పోయింది. యాచారం, కందుకూరు, కడ్తాల మండలాలకు సంబందించిన భూనిర్వాసితులకు ఇళ్ల స్థలాలకు సంబందించి పట్టాలను ఇప్పటికే అందజేసింది. దీనికోసం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలో బల్జగూడ ప్రాంతంలో సుమారు 622 ఎకరాలలో ఎచ్ఎండీఏ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే అక్కడ భూమి చదును చేసి బ్లాకుల వారీగా ప్లాట్లను తయారు చేసి, రోడ్ల నిర్మాణం సైతం చేపట్టారు. ప్లాట్ల పక్కనే నయానగరి (ఫోర్త్‌సిటి) నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే, ప్రస్తుతం పనులు సైతం శరవేగంగా కొనసాగుతున్నాయి. దీంతో రైతులకు ఫార్మా ప్లాట్లపై ఆశలు చిగురించాయి.

## మండలంలో 3745ప్లాట్లు

యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాలకు చెందిన 5720మంది రైతులకు ప్లాట్లు పంపిణీ చేయనున్నారు. ఇందులో యాచారం మండలంలోని నాలుగు గ్రామాలకు కలిపి ఎకరాకు 121గజాల చొప్పున మొత్తం 3745ప్లాట్లు కేటాయించారు. ఇందులో కుర్మిద్ద 1240, నానక్‌నగర్ 359, మేడిపల్లి 1601, తాటిపర్తి 545 గ్రామాల వారిగా పాట్లు మంజూరు చేశారు. రైతుల పేర్లు కెటాయించిన ప్లాట్లకు సంబంధించిన పూర్తి జాబితాను ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో ఉంచారు. ప్లాట్లకు సంబందించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని అధికారులు పేర్కొన్నారు. ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించి అర్హులకు ప్లాట్లను అందజేసేందుకు కృషి చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఫార్మాపాట్ల లబ్దిదారులు యాచారం మండలంలో మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, కందుకూరు మండలంలో మండలం మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, పంజాగూడ, సాయిరెడ్డిగూడ, అన్నోజీగూడ, ముచ్చర్ల, సార్లరావులపల్లి, కడ్తాల మండలంలో పల్లెచెల్కతండా గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. త్వరలో ఇండ్ల స్థలాలు పంపిణీ చేయనుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. లాటరీ విధానం ద్వారా ప్లాట్లు కేటాయించి మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి అప్పగించనున్నారు.

### సకల సౌకర్యాలు కల్పించాలి



ఫార్మా భూనిర్వాసితుల కోసం కేటాయించిన ఇంటి స్థలాలను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలి. సర్టిఫికెట్లు కలిగిన ప్రతి రైతుకు ఎకరాకు 121గజాల చొప్పున ఇంటి స్థలాలను కేటాయించి ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలి. లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ప్లాట్లు కేటాయించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎచ్ఎండీఏ వెంచర్‌లో వాటర్ ట్యాంకులు, బడి, పార్కులు, విద్యుత్, భూగర్భ డ్రైనేజీ, రోడ్లను కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు చేయాలి. రైతులను ఎలాంటి అయోమయానికి గురి చేయొద్దు. ప్రభుత్వం రైతులకు కేటాయించిన స్థలంలో సకల సౌకర్యాలు కల్పించి వెంటనే లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించాలి.

**– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే**

### త్వరలో డ్రా పద్ధతిలో ప్లాట్ల కేటాయింపు



భూనిర్వాసితులకు ప్లాట్లను డ్రా పద్ధతిలో త్వరలోనే కేటాయిస్తాం. ప్లాట్ల లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాం. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదులను పరిశీలించి అర్హులకు ప్లాట్లు అందించేందుకు కృషి చేస్తాం. అర్హులైన లబ్దిదారులకు ఎకరాకు 121గజాల చొప్పున ప్రభుత్వమే రైతుల పేరుమీద మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి రైతులకు డాక్యుమెంట్ ఇస్తుంది.

**– అయ్యప్ప, తహసీల్దార్ యాచారం**




ఫార్మాసిటీ ప్లాట్లు